

'నివేదిని'

నిశారాత్రి యింకా పూర్తిగావిజృంభించలేదు. రవికి వీడ్కోలొసగిన ప్రకృతి చంద్రుని రాక కొఱకు నిరీక్షిస్తోంది. ఆనందమయి, ప్రకృతిమాత ఒడిలో ఎన్నో మనోహర దృశ్యాలు. ఎదిగిన ఆశా లత పుష్పించక ముందే నాలో వైరాగ్యమనే చీడ మొలకలెత్తింది. లోకం అంటే లోకుల సమ్మే ళనం! కాని యీ లోకులలో ఎన్ని రకాలు! ఎన్నెన్ని రంగులు! ఒకొక్కరిలో... మనసులో శాంతిలేదు. అందే ఆశల్ని కాలదన్ని, ఆశయాలకు బలై నిలువలేక హృదయాగ్నిని ప్రకృతిమాతకు పంచాలని యిలాబయలుదేరాను. కామానికి నిలయం అయిన ఈ ప్రజలు అందించిన బహుమానమే యీ మనోవేదన. క్షణక్షణం అశాంతిలో వేగిపోతూ దిక్కు శల్యమవగల యీ అపూర్వ బహుమతిని ప్రసాదించారు.

ఉదయించిన సుధాకరుడు మెల మెల్లగా పైకి వస్తున్నాడు. పిల్లమేఘాలు ఆ వెన్నెలరేడును అందు కోవాలి అని కాబోలు పరుగులు తీస్తున్నాయి. వాటిని చూస్తుంటే నాలో అశాంతి క్రమంగా తొలగి. ఆనందం చోటుచేసుకొంది. నా పెదాలు దరహా సంలో విచ్చుకొన్నాయి. కారణం చెప్తే అతి శయోక్తేమో! కాని స్వచ్ఛమయిన ఆ తారకా నాథుణ్ని సమీపించడానికి ఆ మొయిలుకు స్వచ్ఛత ఎలా వుండాలో, నా మనసును దోచుకోవాలి అంటే కూడా అంతే పరిపూర్ణత కావాలి.

ఒక్కడే ప్రభు. ఆ ప్రభు సేవలో తను లీనమై అంకితమే కావాలి. ఆ ప్రభువే తన సర్వస్వం ఈ లోకం తననేమీ చేయలేదు. అలా జేయకుండా తనని తాను కాచుకోవాలి. ఇది నా ఆత్మ ఆలాపన.

ఆలోచనలో పడి కాలవ గట్టమీద ఎంతదూరం నడిచానో నాకు అర్థంకాలేదు. చంద్రకాంతిలో ఆ పచ్చని పైరులన్నీ విందు జవ్వనుల్లా స్నానం చేస్తున్నాయి. పొలం గట్ల చివరకి వచ్చాను. అంతా కలయ చూశాను, మనోహరంగా ఉంది ప్రకృతి. అక్కడక్కడ కొబ్బరి చెట్ల మీద పడ్డ కిరణాలు తళతళ మెరుస్తున్నాయి. ఆ క్షణం ప్రకృతిమాత సంతృప్తిని ఆనందాన్ని తనివితీర త్రాగించింది.

మరుక్షణం - ప్రకృతిమీద ఏదోనీడ ప్రాకుతూ వచ్చింది, ప్రకృతి అంతా క్షణంలో ఖిన్న బోయింది, నా మనసు బాధతో మెలితిరిగింది. బాధగా తలెత్తి నింగిని చూశాను. ఇంతవరకు నవ్వుతున్న చంద్రుని కారుమేఘం అడ్డుకొంది. నా కళ్ళు భారంగా కదిలాయి, గుండె ఆర్ద్ర మయింది. కొన్ని క్షణాల తరువాత ఆ మేఘం దాటిపోయింది, అమ్మయ్య! నాలో ఎంతోసంతోషం మళ్ళీ జనించింది, కాని యిందాకంత తృప్తిగా లేదు. ఇంకా నా ముందుకు పారజూచాను. ఎదురుగా పచ్చని మైదానం రెండుచేతులూ చాపి నన్నాహ్వానించింది.

గట్టమీదనుండి ఎగిరిదూకి ఆ మైదానంలో నడక ప్రారంభించాను. పచ్చని ఆ మైదానం గుండా కొంతదూరం నడిచాను మానవ జీవితం చాల వింతైనది అనుకొన్నాను. దూరంగా ఏదో వస్తువు నన్ను ఆకర్షించింది. పడివడిగా ఆవైపు అడుగు వేశాను, ఆ వస్తువును సమీపించాను. నాకళ్ళు ఒక్కసారి విశ్చల రూపాన్ని దాల్చాయి. అది వస్తువు కాదు.

ఒకమనిషి అస్తవ్యస్తంగా పడిఉన్న ఒకస్త్రీ. కొంచెం నేపటిలో తేరుకొన్నాను. నన్నింకా భయం ఆవరించలేదు. వంగిచూశాను. ఆమె కండ్లు మూసుకొని ఉంది, ప్రక్కనే మోకాళ్ళ మీద కూర్చుని "ఏమండి" అని పిలిచాను. ఆమె నుండి జవాబు రాలేదు. చేయి ఆమె భుజంమీద వేసి కుదిపాను, కాదు కుదపబోయాను. షాక్ తిన్నట్లు నాచేయి వెనక్కు వచ్చింది. పరిశీలనగా చూశాను ఆమె ముక్కుదగ్గర చేయి ఉంచాను.

ఆమె చనిపోయింది! అది శవం!

ఇంకా నాలో భయం ప్రవేశించలేదు. అందుకే పరిశీలనగా చూశాను, నా నవనాడులు కృంగి పోయాయి. ఆ అబల శరీరం మీద వస్త్రం అస్త వ్యస్తంగా ఉంది. పెదాల మీద గాట్లు ... ఒక్క క్షణం చలించాను ఆమె నా పెదాలు విచ్చుకొని రెండే రెండు అక్షరాలు బయటకు వచ్చాయి ... "రేప్!"

నాలో నాకు తెలియని ఆందోళన బయలుదే రింది. ఎవరో...ఏ దుష్టుడో ఆమెను నమ్మించి యిక్కడకు తీసుకొనివచ్చి ... ఆమెను అనుభ వించి... యిక్కడ వదిలి వెళ్ళిపోయాడు. మొగ్గ దశలోనే యీ సుకుమారి నలిపి నేలరాల్చబడింది. నావళ్లు జలదరించింది. నెమ్మదిగా లేచి నిలబడ్డాను. మనసు ఆవేశంతోను, ఆందోళనతోను, భయ

తోను చలించిపోతోంది వెళాలి. ఇక్కడనుండి తక్షణం వెళ్ళి గురూజీకి చెప్పాలి. ఆయన పూజ్యులు. ఆయన మాననీయులు. ఈ సంగతి ఎలా సంభవించిందో ఆయన ఆరాతీస్తారు. ఆయన తండ్రిలాంటివారు. పుణ్యమూర్తి ఇలాంటివి ఆయన సహించలేరు. ఆయనకు చెప్పాలి. వాతావరణం యిలా కలుషితం కాకూడదు. గిఋన వెనక్కు తిరిగాను.

"ఎవరది?" వెనకనుండి ఒక గంభీరవాదం వినిపించింది. ఆశగా వెనక్కు తిరిగాను. సందేహం లేదు. నా కండ్లని నేను నమ్మలేకపోయాను. ఏ మహావ్యక్తినయితే నేనింతవరకు స్మరించానో ఆయనే ఒక్కసారి యిలా ప్రత్యక్షమయాడా అనిపించింది. ఎప్పుడూ వేసుకొనే దుస్తులే... ఖద్దరు పంచె, ఖద్దరు చొక్కా. మీద ఖద్దరు కండువా. ఆజానుబాహుడు నిండు విగ్రహం. నా హృదయం మీదనుండి ఏదోభారం తొలగిపోయింది, వడిగా గురూజీదగ్గరకు అడుగులు వేశాను. నాలో ఎంతో ఆవేశంపొంగిపొరలుతోంది. చేతులు జోడించి "నమస్తే" అన్నాను. ఆయన నవ్వారు. కాని తిరిగి చేతులు జోడించలేదు. ఆశ్చర్యపోయాను!

"గురూజీ!" ఎలాగో గొంతు పెగల్చుకొన్నాను.

"ఇక్కడేం చేస్తున్నావ్?" కంఠంలో ఒకలాంటి తీవ్రత ధ్వనించింది.

"గురూజీ! ఎవరో...". మాటలకోసం తడుముకోవడం మొదలు పెట్టాను. ఎలా చెప్పాలా అని. కాని ఆయన అన్నారు.

"వెన్నెల బాగుంది కదా! వాతావరణం ఎంత మనోహరంగా ఉంది! ఆ కంఠంలో మత్తులాంటి జీర వినిపించింది. మనోహర ప్రకృతి గురూజీని కూడ మత్తులో ముంచుతోంది కాబోలు!

"అవును గురూజీ! కాని ఆమె...ఈమెని ఎవరో..."నా గొంతులో అడ్డం పడింది. గురూజీ దృష్టి యింకా ఆ వైపు పోలేదు. కాని అది ఎలా సాధ్యం! ఎదురుగా పడివున్న ఆమెను చూడనే లేదా! ఆ ప్రసక్తి తీసుకు రారే! ధర్మ రక్షణ కోసం ఆయనలో శక్తి మేల్కొడే! ఎలా! ఎలా చెప్పాలి? ఆలోచిస్తున్నాను నేను.

గురూజీ చేయివచ్చి నా భుజంమీద పడింది. మనిషికి కనీసం గజం దూరంలో ఉండే గురూజీ నా భుజంమీద చేయివేయడంతో ఒక్క క్షణం స్తంభించాను. శరీరం జలదరించింది. తలెత్తి ఆయన ముఖంలోకి చూశాను. ఆశ్చర్యంతోను అమాయకంగాను. "ఈ వాతావరణానికి నీ రూపు ఎంతో లావణ్యం తెచ్చింది!" గురూజీ అన్నారు. ఆ మాట్లేదేది గురూజీయేనా అని నా అనుమానం! "గురూజీ!" ఆశ్చర్యంగా పిలిచాను. ఆ చేయి తొలగింప ప్రయత్నిస్తూ "ఆనందామృతాన్ని యిక్కడ సేవిస్తే మధురామృతంలా ఉంటుంది కదూ!" ఆపాదమస్తకం చలించాను. ఏమిటిది? ఈ వ్యక్తి గురూజీయేనా? ఏమిటి?

ఈయన యిలా మాట్లాడుతున్నారు. తలెత్తి గురూజీ ముఖంలోకిఅర్థంకాని దృక్కుల్నిపంపాను. ఆ ముఖం ఎప్పటిలా గంభీరంగానె ఉంది. నా కన్నులు గురూజీ కన్నులను కలుసుకొన్నాయి. ఆ కండ్లల్లో ఎప్పటిలా కాంతిలేదు. ఆచోట ఏదో మత్తు! ఏ చూపయితే నేను చూసి చూసి మగజాతి మీద విసిగెత్తిపోయానో అదేచూపు. గురూజీతండ్రిలాంటివారు! ఎంతో మందిని చేరదీసి తండ్రిలా పెంచుతున్న గురూజీ. గురూజీ నన్ను అలాగే చూస్తున్నారా? ఈ పవిత్రమూర్తికి అలా చూడడం వచ్చా! ఆశ్చర్యంతో నా కండ్లు యింకా విప్పారాయి. నాలో ఆశ్చర్యం అమాయకం దోబూచులాడాయి. అసహ్యం వంతపాడింది. ఆ కండ్లల్లో క్రమంగా ఎర్రటి జీరఒకటి కనిపించింది. పరిస్థితి ఊహించాను. లాభం లేదు. ఏ వ్యక్తి అయితే పరోపకారి అని పంపుం పొగుడుతున్నదో ఆవ్యక్తి కామాంధుడు. రంగులు మారే ఊసరవెల్లి. తప్పించుకోవాలి. ఎలా? ఎలా? చక చక 'ప్లాన్' వేశాను. ఆయన ... కాదు అతని రెండవ చేయి యింకా నా రెండవ భుజంమీద పడలేదు. ఏ క్షణంలోనయినా పడవచ్చు. కాని అది పడకముందే తప్పించుకోవాలి. ఎలా? ఎలా!

అతని చూపులు మత్తుతోను, కాంక్షతోను నన్ను చదువుతున్నాయి. ఆపాదమస్తకం ఆ చూపులు తూట్లు పొడుస్తూ నన్ను పునీతం చేస్తున్నాయి. చిన్నగా నవ్వాను.

నా పెదాలు వణకుతూ దరహాసంలో విచ్చుకొన్నాయి. పెదాలు ఎండిపోయాయి.

అతను నా ముఖంలోకి దీక్షగా చూశాడు. అదో తృప్తి అతని ముఖంలో వెలిసింది. అప్పటివరకు భుజంమీద బలంగాఉన్న అతనిచేయి కొంచెం సడలించి. బహుశా పిట్ట జేజిక్కింది ఎక్కువ కష్టం లేకుండా అనుకొన్నాడేమో! ఎవరూ చేజిక్కించుకోలేని కాంత ఏకాంతంలో చిక్కేసరికి మహానందంతో నాడులు సడిలాయో! ఏమో! ఎవరికి తెలుసు ఆ కారణం?

"అందరిలో నువ్వు నన్నెంతో ఆకర్షించావు. నీకళ్లు నన్ను ఎన్నిసార్లు మత్తులో ముంచితేల్చాయో..." ఇంకా ఏమిటేమిటో: అతని నోరు అతని అదుపులో లేదు. నాకు అసహ్యం వేసింది.

అయినా ఫక్కున నవ్వాను. నా క్రియలకు భావాలకు కడుదూరం. అతను సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయి పోయాడు. నాభుజంమీద అతని చేయి చాలతేలికగా ఉంది. అలాతిని ప్రక్కనపెట్టవచ్చు.

ఒక్కసారి క్రిందికి వంగి ఎగిరి వెనక్కి దూకాను. చీర కుచ్చెళ్లు ఎగబట్టి పరుగుతీశాను. పొలంగట్లను చేరుకొన్నాను. వెనక అతని వడి వడి అడుగుల శబ్దం వినవస్తూనే ఉంది. ఇంకొంచెం దూరం పరుగుదీశాను. ఒక్కసారి వెనక్కుతిరిగి చూశానప్పుడు. అతను పొలంగట్టు చివర నిలబడి ఉన్నాడు. మళ్ళీ పరుగు దీశాను. ఎంతవరకు గమ్యంచేరేంత వరకు.

రూమ్‌కి వచ్చిపడ్డాను. అంత చల్లని వాతావరణంలో గూడ నాకు చమటలు పోశాయి, గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అప్పటికే చాలా మంది నిద్రపోయారు. నా బెడ్‌దగ్గరకు చేరాను. నా కాళ్ళు యింకా వణుకుతున్నాయి. నా నెచ్చెలి యింకా నా కొఱకు మేల్కొని ఉంది. నన్ను చూడగానే అంది. "ఏమిటీ! ఎంతసేపు? ఊరికే అలా తిరిగివస్తానని వెళ్ళి యింత సేపా? ఏమిటి అలా ఉన్నావేం? ఏమయింది? రేపు గురూజీకి సన్మానం ఉందని తెలుసా. రేపు ఎంతపని ఉందో తెలుసా!" ఇంకా ఏమిటేమిటో అంటోంది. నాకు క్రమంగా వినపించడం మానివేసింది. నా నరనరాలలోను మొట్టమొదటిసారిగా భయం అనేది ప్రాకడం మొదలెట్టింది. స్పృహతప్పి విరుచుకు పడ్డాను.

అప్పటికి నా మెదడులో యీ భావాలున్నాయి. "సన్మానం! గురూజీ ధరించే ఊసరవెల్లి రంగులకు మెచ్చి ఆయనకు సన్మానం యిస్తున్నారు. అవును ఆ విద్య అందరికీ చేతనవుతుందా మరి? ఈ యుగ పూజ్యులు వీళ్ళు. అలాంటి విద్య తలక్రిందులుగా తపస్సు చేసినా లభిస్తుందా! ఆత్మాభిమానం ఉన్న వారికి? అందుకే వారిని కొలవాలి. వారిని పూజించాలి. అనుకరించాలి, అంతే అంతే."

★




"స్కూలుకి ఎందుకు వెళ్ళడం మానేసావు?" – మొన్నటి వరకూ మేం స్ట్రైక్ చేశాం! యిప్పుడేమో మాష్టర్లు స్ట్రైక్ చేస్తున్నారు. అందుకని స్కూల్సు మూసేశారు